# రావి కొండలరావు

కనకంగారు గుమ్మం దిగేటప్పటికే కాస్త జల్లు అరంభించింది. ఐనా, 'ఆయన ఇదేం చేస్తుందిలే' అని చప్పరించేసి కాలు సారించసాగాడు. కాస్సేపటికి జల్లు వానగా మారింది. పరధ్యానంగా వున్న కనకం గారు ఎడంచెయ్యి పైకెత్తి కుడిచేత్తో గొడుగు తెరవబోయారు. చేతిలో గొడుగు లేదన్న సంగతి మరుక్షణంలోగాని ఆయనకు అర్థంకాలేదు.

ఇదే నా భార్యదగ్గరవున్న అవస్థ. వాన వచ్చేట్టుంది- గొడుగివ్వమన్నా- అంతలోనే మరిచిపోయింది అని గట్టిగానే అన్నాడు- పేరుకు స్వగతమే ఐనా, వాన గోలలో ఆ మాటలు ఎవరికీ వినిపించలేదు. ఎదురుగా కారు వస్తున్నట్టు 'కారుకూత' వల్ల తెలుసుకుని- ఒకక్షణం ఆయన రోడ్డు పక్కగా ఆగాడు. ఆ ఆగటంలో చొక్కావేపు చూసుకున్నాడు. అది పూర్తిగా తడిసిపోయింది. పంచె జీరాడుతూ కిందనంతా బురద కొట్టుకుంది. కనకంగారు హుం' అన్నాడు- వానమీదా, రోడ్డుమీదా, భార్యమీదా అన్నింటిమీద కలిసొచ్చేట్లు. ఇహ లాభంలేదని, పక్కనే వున్న అరుగు ఎక్కి నించున్నాడు.

కనకంగారి ఆలోచనంతా తన భార్యమీదకు మళ్ళింది. దానికి మతిమరుపు ఎక్కువయిపోయింది. ఎంతమంది డాక్టర్లకు చూపించినా ఫలితం కనిపించలేదు. దీనితో తాను వేగలేకపోతున్నాడు. వంట పొయ్యిమీద ట్రంకుపెట్టె పెట్టింది. మొన్న 'అదేమిటి' అంటే- 'అన్నంగిన్నె కాదూ' అని అడిగింది. స్నానం చేస్తూ చేస్తూ బయటకు వచ్చేసి అట్లాగ వీధిలోకి బయల్దేరబోతుంది. పౌడరుడబ్బాతో తలదువ్వుకుంటుంది- దువ్వెనతో ఒళ్లు రుద్దుకుంటుంది- సబ్బుతో వంట చేస్తుంది! ఒక్కొక్కప్పుడు తననే గుర్తుపట్టదు! 'నేనే నేనే' అంటూ తను ఎంత దగ్గరగా కనిపించినా 'ఎవరు?' అని అడుగుతుంది. అర్థంలేని ఈ మతిమరుపుతనానికి ఏం చెయ్యాలో తనకేం అర్థంకాదు. ఈ మనిషితో ఇట్లాగే జీవితమంతా గడపవలసిందే-అని నిట్టూర్చాడాయన. ఇంకా కాస్సేపు ఆయన అట్లాగే ఆలోచించి, వానమాట ఎట్లా వుందని అరుగుమీదనుంచి చేతిని ఓసారి ముందుకు చాచాడు. చెయ్యి తడిసినట్టులేదు. కనకంగారు పరధ్యానం నుంచి తేరుకుని కళ్లు పెద్దవిచేసి చూడగా- పెళ్లుమని ఎండ కనిపిస్తున్నది. 'ఈ వాన ఎప్పుడో ఆగిపోవడం, ఎండ రావడం కూడా జరిగిపోయాయన్నమాట- అదిగో, దాని ధ్యాసలో పడితే నాకు పరధ్యానమే' అన్నాడు అరుగు దిగుతూ.

కనకంగారు ఏదో చిన్న మీటింగువుంటే బయల్దేరాడు. దారిలో ఈ అవాంతరం వచ్చింది. మీటింగు ప్రారంభమే అయిపోయిందో, లేక అయిపోయిందో అనుకున్నాడు. టైమెంతయిందో చూసుకున్నాడు. 'ఛ ఛ- నా భార్య విషయం ఆలోచిస్తే చాలు- అన్నీ మరిచిపోతాను' అని తిట్టుకున్నాడు.

మరో పావుగంటలో కనకంగారు మీటింగు ప్రదేశానికి చేరుకున్నాడు. ఆర్గనైజర్లు హడావిడిగా తిరుగుతున్నారు తప్ప- మీటింగు కనిపించలేదు! 'ఈ వర్షం నా ప్రాణం తీసింది. ఇంకేముంది అంతా ఐపోయింది- బల్లలూ, కుర్చీలూ లాగేస్తున్నారు.' అని వెనక్కు తిరిగి 'బ్యాడ్జీమనిషి' ఒకడు కనిపిస్తే 'ఎంతసేపయిందండీ మీటింగయిపోయి?' అని అడిగాడు కంగారుగా. 'అయిపోవడమేమిటండీ ఇంక ప్రారంభంకాందే. మీటింగు ఆరుగంటలకు- యిప్పుడింకా నాలుక్కూడా కాలేదుగా' అన్నాడు బ్యాడ్జీమనిషి. మరోసారి కంగారు పడుతూ కనకంగారు నాలిక కరుచుకుని, 'పొరపాటుగా చూసివుంటానండీ టయిమూ' అన్నాడు. బ్యాడ్జీమనిషి వినిపించుకోలేదు- అతని కంగారులో అతను ఆరుమైళ్ళదూరం వెళ్ళిపోయాడు.

కనకంగారు అయితే అయిందని వెనక సీట్లకుపోయి అక్కడ కూచున్నాడు. ఇప్పుడు మళ్ళా వెనక్కుపోవటం ఏమిటిలెమ్మనుకున్నాడు. ఎదురుగా చూసి- 'ఓహో, బల్లలూ కుర్చీలూ వేస్తున్నారా- లాగేస్తున్నారనుకున్నాను నయమే!' అనుకున్నాడు. ఇంకా రెండుగంటలసేపు ఇక్కడ ఒంటరిగా కూచోవాలి కాబోలు, ఎవరూ తోడైనా లేరు....

వేదిక దగ్గరగా ఎవరో ఒక మగాయనా, ఆడావిడా మాట్లాడుకుంటున్నట్టుగా కనకంగారు కళ్ళజోళ్ళోంచి కనిపెట్టి, అక్కడికి పోతే కాస్త కాలక్షేపం అవుతుందని బయల్దేరాడు. కనకంగారు అక్కడికి వచ్చేసరికి, ఆవిడమాత్రం ఒక్కర్తే కూచుని వుంది. మగాయన ఆర్గనైజరులా వున్నాడు - హడావిడిగా ఎటో వెళ్ళిపోయాడు. ఆమె నలభైయేళ్ళ మనిషిలా వుంది. ఐతేనేం అందంగా ముస్తాబై దబ్బపండల్లే వుంది. కనకంగారికి మంచి కాలక్షేపం అనిపించి ఆమె పక్కగా రెండు కుర్చీల అవతల కూర్చుని మీసం ఓసారి సరిచేసుకుని, కళ్ళజోడుతీసి ఓసారి తుడిచి, మళ్ళీ తగిలించుకుని- తడిసిపోయి ఎండుతున్న చొక్కాను ఓసారి సర్దుకుని ఆమెకేసి ఓరగా చూశాడు. ఆమె ఎటో చూస్తూ కనకంగారిని గమనించలేదు. శబ్దం చెయ్యాలని, రాని దగ్గు ఒకటి దగ్గాడు. ఆమె చూసింది- మరో నాలుగు దగ్గులయ్యాక.

'మీరు ఆర్గనైజరాండీ?' అన్నాడు కనకంగారు ఆమెకేసి చూస్తూ.

'కాదండీ మీటింగుకోసం వచ్చాను' అన్నది.

కనకంగారు నవ్వి- 'నేనూ దానికోసమే వచ్చానండి. టైము జ్ఞాపకంలేదు. దానికి తోడు వర్షం కూడా వచ్చింది. శుభ్రంగా తడిసిపోయాను పాపం' అన్నాడు నవ్వుతూనే.

'పొడిగుడ్డలు వేసుకుని రావలసింది!' అన్నదామె.

'నిజమే. కాని మళ్ళా ఎక్కడపోతానండి- అందుకనే కూచున్నాను. ఇంకాస్సేపటికి ఆరిపోతాయి.'

'దీపాలా?' అందామె.

'కాదండీ గుడ్డలు' అని గొల్లున అరగంట నవ్వాడు కనకంగారు. ఆమె జోకు వేసిందని!

కంగారు
కనక కంగారు



'మీటింగు ఆరుగంటలకని ఆహ్వానం అందిందనుకోండి. ఏదీ- నాకు లక్ష వ్యాపకాలు. పోనీ, మా ఆవిడ జ్ఞాపకంచేసి చెబుతుందేమో అనుకొంటే- ఆమె ఉత్త మతిమరుపు మనిషి. ఆహ్వాన వచ్చినట్టు కూడా తెలుసో లేదో ఆమెకు' అన్నాడు కనకంగారు.

'మతిమరుపే! ఎలా కాలక్షేపం చేస్తున్నారు బాబూ ఆవిడతో.' అందావిడ విరాగ్గా,

'ఎలా అంటారేమిటి- చేస్తున్నాను. ఏదీ- ఏదీ గుర్తుండదండీ- ఎన్ని మందులు, ఎంతమంది డాక్టర్లు-'

'సరిగ్గా నా ఖర్మకూడా అంతేనండీ. మా వారికికూడా మతిమరుపు జబ్బే.' కనకంగారు ఏదో దొరికినట్టుగా లేచి, ఆమెకు మరికాస్త దగ్గరగా వెళ్ళి కూచుని- 'ఏమిటి ఏమిటి- మీరూ పడుతున్నారూ ఈ అవస్థ!' అన్నాడు నవ్వుతూ.

'మా ఆయన సంగతి అడక్కండి. ఆయనగారికంటె మీ ఆవిడగారే నయమనిపిస్తారు. ఆఫీసుకు వెళతానని పార్కులోకి వెళ్ళి కూచుంటారు. అర్ధరాత్రివేళ లేచి ఆఫీసుకుపోవాలని బయల్దేరుతారు. బజారు వెళ్ళి కూరగాయలు తీసుకురమ్మంటే- పక్కింటికి వెళ్ళి పేకదస్తాలు తీసుకొస్తారు. చచ్చిపోతున్నాను. ఏదీ జ్ఞాపకం వుండదు' అన్నదామె విరాగ్గా.

'సరిగా నా యిల్లాలూ అంతే. విడాకులిచ్చేసి ఇంకెవర్నయినా చేసుకుందామా అనిపిస్తుంది' అన్నాడాయన.

'నాకూ అలాగే అనిపిస్తుందండీ. చెప్పొద్దూ' అన్నదామె.

కనకంగారు తమాషాగా నవ్వి- 'జోకుకు అంటున్నాను సుమండీ- ఇలా మీరు మీ వారికీ, నేను మా ఆవిడకు విడాకులు ఇచ్చేసిన తర్వాత వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకోవాలిట!'

'ఇహ చూడాలి కాపురం' అని ఆమె కూడా గొల్లున నవ్వింది. కనకంగారు తన జోకు బాగా పేలినందుకు, ఇంకా నవ్వాడు.

'మతిమరుపు, మనిషిని ఎలా మార్చేస్తుందనుకున్నారు? అది వుండకూడదండీ' అన్నాడు కనకంగారు.

'మా ఆయనగారి బాధలు పడలేకే నేను ఈ మీటింగులుకనీ, వాటికనీ వచ్చేస్తూ వుంటాను.'

'వస్తారా మరి.'

'ఆరింటికి మీటింగుందని ఆయనతో చెప్పాను. అలాగే అన్నారు. వస్తారు- ఏ ఎనిమిది గంటలకో!' అని నవ్విందామె.

'ఎంత బావుంది నవ్వు' అనుకున్నాడు కనకంగారు- తన భార్యకు విడాకులిచ్చేసి- ఈమెచేత ఆమె భర్తకూ ఇప్పించేస్తే- తనూ ఈమే.... ఓహ్! కనకంగారి గుండె 'ఝల్లు'మని కంగారుగా కొట్టుకుంది. అయినా ఆ 'ఝల్లు' తియ్యగా వుంది! ఆ ధ్యానలోపడి, ఇటుతిరిగి చూసేసరికి అక్కడ కనిపించలేదు, కంగారుగా అటూ ఇటూ చూశాడు. ఆర్గనైజర్ల హడావిడి తప్ప ఇంకేంలేదు- సరే వస్తుందిలెమ్మనుకుని- దీమాగా కుర్చీలో చతికిలబడ్డారు కనకంగారు.

కాస్సేపటికి ఆర్గనైజరు ఒకడు కంగారు పడుతూ వచ్చి- 'సార్- మీతో యింతసేపూ మాట్లాడుతున్న కామేశ్వరమ్మగారు మతిమరుపు మనిషి' అంటూ వెతకడానికి కంగారుగా బయల్దేరాడు ఆర్గనైజరు.

'కామేశ్వరమ్మా!' అని కనకంగారు తపీమని లేచి గట్టిగా ఓ కేకపెట్టాడు- 'ఐతే ఆమె నా భార్యేనయ్యా!' △


జ్యోతి రజతోత్సవ ప్రత్యేక సంచిక
సందర్భంగా శుభాకాంక్షలు
★ ★ ★
పండుగలకు, వివాహాది శుభకార్యాలకు
మీకు కావలసిన
★ బనారస్, బెంగుళూరు,
★ ధర్మవరం, కాంచీపురం,
★ ఆరణి, పోచంపల్లి,
★ మైసూర్ క్రేప్ పట్టుచీరలు
మరియు...
★ గద్వాల్, కోయంబత్తూర్,
★ సేలం, వెంకటగిరి,
★ పోచంపల్లి, మధురై,
ఇంకా అనేక రకాల కాటన్
మరియు మిల్లు వస్త్రాలకోసం
విచ్చేయండి!

వెంకటరమణ
బనారస్ సిల్క్ హౌస్
3-2-100 జనరల్ బజార్,
సికింద్రాబాద్-3

సరికొత్త స్టాకును ఉంచుట మా
ప్రత్యేకత